క్లుప్తంగా

సంజయ్ అనుచరుల ద్వారానే పేపర్ లీకేజీ

• ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర : ఎంపీ బండి సంజయ్ తన అనుచరుల ద్వారా పదో తరగతి హిందీ పేపర్ లీకేజీ చేయించి తెలంగాణ ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుతాన్ని ఇబ్బంది పెట్టడంతో పాటు విద్యార్థుల జీవితాలతో బండి సంజయ్ చెలగాటమాడుతున్నారన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో సైతం బండి సంజయ్ హస్తం ఉందని, అధికారం కోసం బండిసంజయ్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



పట్నం వద్ద ఒగ్గు పూజారులు

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పూజారులు నాగవెల్లి పట్నం వేసి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఒగ్గుడోలు కళాబృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ కంకణాల విజయేందర్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచులు కర్ర సత్య ప్రసన్న, గుండి మానస, పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్, ప్రధానోపాధ్యాయురాలు రాధ, ఉపాధ్యాయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

శంకరపట్నం : మండలంలోని కేశవపట్నంలో బుధవారం వర్తక, వ్యాపార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో బషీరొద్దీన్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తనుకు ఓంకారం, ప్రభాకర్, హనమంతు ,శ్రీనివాస్, తిరుపతి, కోటి, సత్యనారాయణ, ప్రసాద్, సాంబమూర్తి, చంద్రగుప్త, నరేందర్, వీరస్వామి, సమ్మయ్య, కిష్టస్వామి, రామస్వామి, రమేశ్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



రామడుగు: మండల కేంద్రంలో బుధవారం బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా లంక మల్లేశం, గౌరవాధ్యక్షులుగా కలిగేటి లక్ష్మణ్, కాడె శంకర్, తడగొండ న ర్సింగ్‌బాబు, వైస్ చైర్మన్‌గా మాదం రమేశ్, బుత్కూరి కాంత, ప్రధాన కార్యదర్శిగా చంటి జితేందర్, క్యాషియర్లుగా జట్టుపల్లి అనిత్, అరపల్లి ప్రశాంత్, సభ అధ్యక్షుడిగా తడగొండ హన్మంతుతో పాటు పలువురిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వన్నారంలో 'ఇంటింటికీ తెలుగుదేశం'

రామడుగు: మండలంలోని వన్నారంలో బుధవారం టీడీపీ నాయకులు ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో టీడీపీ చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జంగం అంజయ్య, మండల టీడీపీ శాఖ అధ్యక్షుడు అమిరిశెట్టి సుధాకర్, నాయకులు కాంతయ్య, కనకయ్య, లక్ష్మీరాజం, మల్లేశం, ఒదయ్య పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కౌశిక్‌రెడ్డి



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కలిగేటి కవిత



దేవంపల్లిలో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి

హుజూరాబాద్/మానకొండూర్ రూరల్/మానకొండూర్/ గన్నేరువరం/ రామడుగు/ జమ్మికుంట/ సైదాపూర్/ శంకరపట్నం: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, అణగారిన వర్గాల అభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ కృషిచేశారని పలువురు నేతలు పేర్కొన్నారు. హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల్లో బుధవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. వేడుకల్లో ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణాలు

- రెండేళ్ల వడ్డీ.. బ్యాంకు ఖాతాల్లోకి
- రూ.89 లక్షలు మంజూరు
- హర్షం వ్యక్తంచేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

గన్నేరువరం: గడువు ముగియకుండా రుణాలను సకాలంలో చెల్లించిన మహిళా సంఘాలకు ప్రభుత్వం రెండేళ్ల వడ్డీని విడుదల చేసింది. బ్యాంకుల్లో తీసుకున్న రుణం స్వశక్తి సహాయక సంఘాలు ప్రతినెలా 10వ తేదీలోగా అసలు, వడ్డీని చెల్లిస్తున్నారు. వడ్డీని మూడునెలలకోసారి సంఘం పొదుపు బ్యాంకు ఖాతాలో జమచేయాల్సి ఉంటుంది. నాలుగేళ్లుగా వడ్డీ చెల్లింపులు నిలిచిపోగా మహిళా సంఘాల సభ్యులకు రెండేళ్ల వడ్డీ డబ్బులను ప్రభుత్వం విడుదల చేసింది.

మండలంలో 492 గ్రామ స్వశక్తి సంఘాలు

మండలంలో 492 గ్రామ స్వశక్తి సంఘాలు, 25 గ్రామైక్య సంఘాలు (వీవో సంఘం) ఉన్నాయి. సుమారు 5,500 మందిపైగా సభ్యులుగా ఉన్నారు. సీనియర్టీ ప్రాతిప్రాదికన సంఘాలు రూ.50 వేల నుంచి నుంచి రూ.20 లక్షల వరకు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నాయి. ఈ రుణాలపై బ్యాంకులు 12 నుంచి 14 శాతం వరకు వడ్డీని వసూలు చేస్తున్నాయి.

2014 నుంచి..



మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన అధికారులు

మండలంలోని మహిళా సంఘాలు ఏటా వడ్డీ రుణాలను బ్యాంకు ద్వారా పొందుతున్నారు. 2014 వరకు గత కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రతి ఆరునెలలకోసారి వడ్డీని సంఘాలకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2014 జూన్‌లో ఏర్పాటైన టీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు సంబంధించిన వడ్డీ రుణాల చెల్లింపులపై నిర్లక్ష్యం చేయడంతో 2014–2018 వరకు వీటి బకాయిలు చెల్లింపులు సుమారుగా రూ.75 లక్షలకు చేరాయి. మహిళా సంఘాల సభ్యులు మాత్రం నెలానెలా గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసుకని సంఘాల లావాదేవీలు, రుణాల చెల్లింపుల్లో సక్రమంగా ముందుకెళ్లారు. 2018 ఎన్నికల ముందు వడ్డీని ప్రభుత్వం చెల్లించింది. మళ్లీ 2018 నుంచి వడ్డీ చెల్లింపులు నిలిచిపోవడంతో మహిళా సంఘాలకు భారంగా మారింది. గతనెలలో 2018–19, 2019–20లకు సంబంధించి వడ్డీ బకాయిలను విడుదల చేసింది.

మహిళా సంఘాలకు విడుదలైన నిధులు

గ్రామం	మహిళా సంఘాలు	రూ.
చీమలకుంటపల్లె	36	రూ.5.88.471,
గన్నేరువరం	96	రూ.18,35,053,
గోపాల్‌పూర్	12	రూ.2,63,182
గుండ్లపల్లి గునుకుల	32	రూ.5,97,978,
కొండాపూర్	50,	రూ.7,32,178,
హన్మాజిపల్లె	42,	రూ,10,690,70
జంగపల్లి		రూ.14,64,684
ఖాసీంపేట	30,	రూ.6,74,254
మాదాపూర్	24,	రూ.4,04,606
మైలారం	39,	రూ.8,36.118
పారువెల్ల	21,	రూ.2,29,039
పీచుపల్లిలో	8	రూ.2,38,668

బ్యాంకులో జమయ్యాయి



స్వశక్తి మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి 447 మహిళా సంఘాలకు రెండేళ్ల వడ్డీ బకాయిలు రూ. 89 లక్షల 33 వేల 92 లను ప్రభుత్వం విడుదలకాగా మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఈ ఏడాది మహిళా సంఘాలకు 30 కోట్ల 42వేల రుణాలు అందించాం.

– లావణ్య, ఏపీఎం గన్నేరువరం

వడ్డీ డబ్బులు వచ్చాయి



పీచుపల్లి గ్రామంలోని 8 మహిళా సంఘాలతో కలిపి బాగ్యలక్ష్మీ వీవో సంఘంగా ఏర్పాటు చేశాం. ఈ వీవోలోని 8 మహిళా సంఘాలకు కలిపి వడ్డీ రూ.2,38,668 నిధులను వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమా చేసింది. మరో రెండెళ్ల వడ్డీతో పాటు స్త్రీ నిధి వడ్డీ రావాల్సి ఉంది. వీటిని త్వరగా విడుదల చేయాలి.

– పీచు పద్మ, వీవో అధ్యక్షురాలు, పీచుపల్లి

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



టపాసులు కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్ : పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా గెల్లు శ్రీనివాస్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం బీఆర్ఎస్ నాయకులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద బాణసంచ కాలుస్తూ , సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

చొప్పదండిలో..

చొప్పదండి: రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవికి గెల్లు శ్రీనివాస్ యాదవ్ నియామకం పట్ల చొప్పదండిలో టీఆర్ఎస్‌వై మండల అధ్యక్షుడు మారం యువరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బందారపు అజయ్, శ్రీరాం, శ్రీకాంత్, నరేశ్, నితీశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి

జమ్మికుంట: మడలంలోని వావిలాలకు చెందిన మామిడి మధునయ్య (57) అనే గీత కార్మికుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధునయ్య తాటి ఎక్కుతుండగా మంగళవారం మోకు జారి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామచందర్‌రావు తెలిపారు.

వైభవంగా సూర్య రథోత్సవం

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సూర్య రథోత్సవం (చిన్నరథం) వైభవంగా నిర్వహించారు. రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ మాడ వీధులగుండా రథాన్ని లాగారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



రామస్వామి ఫైల్

ఇల్లందకుంట: మండలకేంద్రానికి చెందిన దంసాని రామస్వామి (52) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామస్వామి ఈనెల 2న ఇల్లందకుంట బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా జమ్మికుంట నుంచి సిరిసేడు వైపు వెళ్తున్న సీతంపేటకు చెందిన బోయిని రవి ద్విచక్రవాహనంతో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు దంసాని సతీశ్ ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొత్తపల్లి: కొత్తపల్లి–రేకుర్తి శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం గంగారాంతండాకు చెందిన లావుడ్య రాజయ్య అతడి కుమారుడిని బుధవారం రేకుర్తిలోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో చేర్పించి తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొత్తపల్లి శివారులో వేగంగా వచ్చిన బుల్లెట్ వాహనం ఢీకొంది. రాజయ్య తలకు, చేతికి గాయాలయ్యాయి. గాయాలైన అతడిని కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అజాగ్రత్తగా బుల్లెట్ నడుపుతూ తన భర్తకు గాయాలు కావడానికి కారణమైన కోరుట్లకు చెందిన ఎం.రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



హుజూరాబాద్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



చిగురుమామిడిలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో నాయకులు నిరసన, ధర్నాలు చేశారు. అక్రమ అరెస్టతో బీజేపీని అడ్డుకోలేరని, రాష్ట్ర ప్రభుత్వ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. టీఎస్‌పీఎస్సీ, ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణలో సీఎం కేసీఆర్, ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే ఎంపీ బండి సంజయ్‌ను లీకేజీ కేసులో ఇరికించి అక్రమంగా అరెస్టు చేశారని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

14న ఇఫ్తార్ విందు

విద్యానగర్(కరీంనగర్): రంజాన్ మాసం సందర్భంగా ఈనెల 14న నగరంలోని ఎస్ఎస్ గార్డెన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోస్, కార్పొరేటర్ షరీఫొద్దీన్, నాయకులు ఆతిన, అలీబాబా, అజర్ దబీర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్
- ముదిమాణిక్యంలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ముదిమాణిక్యంలో ఏర్పాటు చేసిన బీఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ గీకురు రవీందర్, ప్యాక్స్ చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, మండలపరిషత్ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, సర్పంచ్ జక్కుల రవి, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ముంజ శిరీష ప్రకాశ్, ఎంపీడీవో నర్సయ్య, తహశీల్దార్ ముబీన్ అహ్మద్, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య, రైతు బంధు జిల్లా కమిటీ సభ్యుడు సాంబారి కొంరయ్య, మండల రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ తిరుపతి, అంబేడ్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల సమన్వయకర్తగా కర్ర రవీందర్

మండల బీఆర్ఎస్ సమన్వయకర్తగా కోహెడ మండల కేంద్రానికి చెందిన కర్ర రవీందర్‌ను నియమిస్తూ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఉత్తర్వులు అందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

బహుమతులు ప్రదానం..

ఇందుర్తిలో లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల్లో విన్నర్ జట్టుకు రూ.10 వేలు, కప్‌ను, రన్నర్ జట్టుకు రూ.4,500 నగదుతో పాటు కప్‌ను ఎమ్మెల్యే సతీశ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశమివ్వండి



మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక: రానున్న ఎన్నికల్లో తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చల్లూర్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను గెలిపించి, సీఎం కేసీఆర్‌కు బహుమానంగా ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన ఈటల రాజేందర్ అభివృద్ధి చేయలేదన్నారు. కరీంనగర్‌లో బండి సంజయ్, హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌కు డిపాజిట్ రావన్నారు. సమిష్టిగా పనిచేస్తే లక్ష మెజారిటీతో గెలువడం ఖాయమన్నారు. ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాడ వనమాల సాధవరెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ...

హుజూరాబాద్ రూరల్ : మండలంలోని తుమ్మనపల్లి, మందాడిపల్లి, సింగాపూర్ గ్రామాల్లో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి చెక్కులను అందజేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట : జమ్మికుంటలో 35 మందికి లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డికల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు.

తొలగిన 'జగ్జీవన్ రామ్' ముసుగు

- విగ్రహానికి నివాళులర్పించి క్షీరాభిషేకం
- కాసేపటికే మళ్లీ ముసుగు వేసిన ఆర్టీసీ అధికారులు



విగ్రహం వద్దకు దూసుకువస్తున్న నాయకులు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పక్కన, ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో గతేడాది దళితసంఘాల నాయకులు బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. రాత్రికి రాత్రే విగ్రహాలు ఏర్పాటు చేయడంతో ఆర్టీసీ అధికారులు వాటిని ప్రారంభించకుండా అడ్డుకోవడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడాదికిపైగా ముసుగు వేసి ఉన్న విగ్రహాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని దళిత సంఘాల నేతలు బుధవారం ఆవిష్కరించారు.

అంబేడ్కర్ భవనంలో వేడుకలు..

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ సంఘ భవనంలో అధ్యక్షుడు మాతంగి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి హాజరై దళిత సంఘాల నాయకులతో కలిసి బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అధికారంలో ఉండి మహానుభావుల విగ్రహావిష్కరణలకు నోచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కొందరు నేతలు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించి నివాళులర్పించారు. అంబేడ్కర్ మండల అధ్యక్షుడు మాతంగి లక్ష్మణ్, సర్పంచులు మీసాల అంజయ్య మేడి అంజయ్య, బోయిని కొమురయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు. ఎల్ఎండీ ఎస్ఐ శీలం ప్రమోద్ రెడ్డి సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకునే లోపే దళిత సంఘాల నాయకులు అక్కడి నుంచి ఉడాయించారు. అనంతరం ఆర్టీసీ అధికారులు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ముసుగువేశారు. కొంతమంది నాయకులపై ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన



బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గంగాధర: పదో తరగతి హిందీ పేపర్ లీకేజీలో ఎంపీ బండి సంజయ్ పాత్ర ఉందని ఆరోపిస్తూ బుధవారం మండలంలోని మధురానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇక్కడ నాయకులు నవీన్‌రావు, వేముల దామోదర్, వేముల అంజి, భాస్కర్, మ్యాక వినోద్, చందు, అజయ్, ద్యావ సంజీవ్, మల్లయ్య, అఖిల్, బన్నీ, శ్రీకాంత్, వెంకటేశ్, వేణు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి కుండల్లో చిరుధాన్యాలను వండి భక్తులకు ప్రసాదంగా అందించారు.